సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం : 5 : మార్చి : 2024



అప్పన్నకు ఆర్జిత సేవలు

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. 8లో



తల్లీ బిడ్డ క్షేమమే ప్రభుత్వ లక్ష్యం

తల్లీ బిడ్డ క్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఐటీడీఏ పీవో అభిషేక్, ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. 8లో



బాల్య వివాహాల నిర్మూలనకు కృషి

బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య అన్నారు. 8లో

న్యూస్‌రీల్

ఉమానీలకంఠుడికి కిరణాభిషేకం



ఉమానీలకంఠేశ్వరస్వామి మూలవిరాట్టుపై ప్రసరించిన సూర్యకిరణాలు

సాక్షి,పాడేరు: పట్టణంలోని పాతబస్టాండ్ ఏరియాలో కొలువుదీరిన ఉమానీలకంఠేశ్వర స్వామి మూలవిరాట్టును ఇటీవల ప్రతిరోజు సూర్యకిరణాలు తాకుతున్నాయి. గతంలో ఏడాదికి రెండు మూడు సార్లు మాత్రమే సూర్యకిరణాలు శివలింగం, ఉమానీలకంఠేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను తాకేవి. ఆసమయంలో ఉండే భక్తులు దర్శించుకునేవారు. వారం రోజులుగా వేకువజామునే సూర్యకిరణాలు గర్భంగుడిలోకి ప్రవేశించి శివలింగంపై ప్రసరిస్తుండడంతో భక్తులంతా పరమపవిత్రంగా భావించి దర్శించుకుంటున్నారు. ఆలయ అర్చకుడు రామంతో పాటు ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, ఇతర కమిటీ ప్రతినిధులంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రం పరిశీలన



రంపచోడవరంలో ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయ సునీత

రంపచోడవరం: జిల్లాలో ప్రశాంత వాతావరణలో ఇంటర్మీడియెట్ పరీక్షలు జరుగుతున్నాయని కలెక్టర్ విజయ సునీత తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని ఆమె సోమవారం సందర్శించి, పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరీక్షలు పూర్తయ్యే వరకు విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని, పరీక్ష కేంద్రాల్లో వెలుతురు వచ్చే విధంగా ఉండాలని, లైట్లు కూడా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, రంపచోడవరం తహసీల్దార్ ఎ.కృష్ణజ్యోతి తదితరులు ఉన్నారు.

గిరిజన భవన్ ప్రారంభం రేపు



గిరిజన భవన్ వద్ద నాయకులు

కొయ్యూరు: మండల కేంద్రం రాజేంద్రపాలెంలో నిర్మించిన గిరిజన భవన్‌ను బుధవారం ప్రారంభించనున్నారు. రూ.25 లక్షల ఎంపీ నిధులతో దీనిని నిర్మించారు. రూ.1.25 లక్షల ఉపాధి నిధులను కేటాయించారు. భవనాన్ని ఎంపీ మాధవి, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, జెడ్పీచైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ప్రారంభించనున్నారు. ఈ మేరకు వారిని ఆహ్వానించినట్టు గిరిజన ఉద్యోగుల సంఘం నేతలు నర్సి కృష్ణ, పాపారావు సోమవారం తెలిపారు. ఎంపీ మాధవి చొరవ తీసుకుని నిధులు విడుదల చేయడంతో భవనం నిర్మాణం పూర్తయిందని వారు చెప్పారు. బీఎస్ఎన్ఎల్ కేంద్ర సలహా కమిటీ సభ్యులు కిరణ్ పాల్గొన్నారు

ఏయూను సందర్శించిన వెస్ట్రన్ ఆస్ట్రేలియా ప్రతినిధి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని యూనివర్సిటీ ఆఫ్ వెస్ట్రన్ ఆస్ట్రేలియా ఎంగేజ్‌మెంట్ మేనేజర్ బ్రోడెరిక్ మోన్‌క్రిఫ్ సోమవారం సందర్శించారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల విభాగం పూర్వ డీన్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయ రావులతో సమావేశమయ్యారు. ఏయూలో వెస్ట్రన్ ఆస్ట్రేలియా కార్నర్ ఏర్పాటు చేయడం, సంయుక్తంగా కోర్సుల నిర్వహణ, విద్యార్థుల భాగస్వామ్యం చేయడం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఏయూలో ఎంతో శక్తివంతమైన ఫార్మసీ కళాశాల, సైన్స్, ఆర్ట్స్, న్యాయ కళాశాలలు కలిగి ఉండటం వాటి ప్రత్యేకతలను రిజిస్ట్రార్ వివరించారు. ఏయూలో నూతనంగా నిర్మించిన ఎలిమెంట్ భవనం, ఆ హబ్‌లను బ్రోడెరిక్ సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ తరఫున బ్రోడెరిక్‌ని రిజిస్ట్రార్ సత్కరించారు.

విశ్వవ్యాప్తం.. విశాఖ వైభవం



- నగరాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ విజన్
- వాణిజ్య, పారిశ్రామికవేత్తలతో సమావేశం కానున్న ముఖ్యమంత్రి
- ఏపీ డెవలప్‌మెంట్ డైలాగ్ పేరుతో నిర్వహణ
- స్కిల్ డెవలప్‌మెంట్ నిర్వహణపై సీఎం సమక్షంలో ఎంవోయూలు

సాక్షి, విశాఖపట్నం : విశాఖపట్నం.. పెట్టుబడులకు ప్రధాన కేంద్రంగా మారింది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. నగరానికి కొత్త ఇమేజ్ తీసుకొచ్చేందుకు ఆలోచనలు కార్యరూపం దాల్చేలా అడుగులు వేశారు. విశాఖలో ఇతర పరిశ్రమలకూ ఆస్కారం ఉందన్న ఆలోచన దిగ్గజ పారిశ్రామికవేత్తల మదిలో కలిగేలా.. విశాఖను గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌తో విశ్వవ్యాప్తంగా ప్రమోట్ చేశారు. అందుకే.. దిగ్గజ పారిశ్రామికవేత్తలు వైజాగ్‌కు క్యూ కట్టారు. భవిష్యత్తులో విశాఖ వైభవాన్ని విశ్వం వినువీధుల్లో ప్రతిబింబించేలా సమగ్ర కార్యచరణను అమలు చేసే ప్రణాళికలతో సీఎం వైఎస్ జగన్ ముందుకొస్తున్నారు. వాణిజ్యవేత్తలు, పారిశ్రామిక ప్రతినిధులతో ఏపీ డెవలప్‌మెంట్ డైలాగ్ పేరుతో విజన్ విశాఖ సదస్సులో పాల్గొంటున్నారు. విద్యార్థుల భవిష్యత్తు బంగారు బాటలో నడిచేలా విశాఖను నైపుణ్యాభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు సైతం అడుగులు పడుతున్నాయి.

విజన్ వైజాగ్ పేరుతో..

పరిశ్రమలకు పట్టుగొమ్మగా.. ఉపాధి కల్పనకు ఆలంబనగా.. పెట్టుబడులకు స్వర్గధామంగా.. అంతర్జాతీయ నగరంగా భాసిల్లుతున్న విశాఖ.. భవిష్యత్తులో మరింత గొప్పగా అభివృద్ధి చెందేందుకు ఉన్న వనరులేంటి..? వాటిని ఎలా వినియోగించుకోవాలి.. ప్రపంచ పటంలో విశాఖని ఎలా నిలబెట్టాలనే సంకల్పంతో విజన్ వైజాగ్ కాన్సెప్ట్‌తో సీఎం వస్తున్నారు. ఆది నుంచి దూసుకుపోతున్న రియల్ రంగం, అందుబాటులో మౌలిక వసతులు వెరసి దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు విశాఖపట్నం వైపు చూసేలా చేసింది గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్. ఇప్పటికే పలుమార్లు నివాస యోగ్యమైన నగరంగానూ... వ్యాపారానికి అనువైన నగరాల్లో విశాఖపట్నం చరిత్రకెక్కింది. సరికొత్త విశాఖ ఆవిష్కృతమయేలా.. పరిశ్రమలు, పర్యాటకం, హాస్పిటల్స్, హోటల్స్, మౌలిక సదుపాయాలు తదితర రంగాలకు చెందిన సుమారు 2000 మందితో సీఎం చర్చించనున్నారు. విశాఖపట్నం విజన్ డాక్యుమెంటును ముఖ్యమంత్రి వివరించనున్నారు. రాష్ట్రంలోని పారిశ్రామిక ప్రాంతాలలో కల్పించిన మౌలిక సదుపాయాల గురించి, విశాఖ నగరంలో పర్యాటక రంగానికి ఉన్న అవకాశాల గురించి వైఎస్ జగన్ సంభాషించనున్నారు.

విద్యార్థుల నైపుణ్యానికి 'భవిత'...

విద్యకు అధిక ప్రాధాన్యమిస్తూ.. రాష్ట్రంలోని విద్యార్థులు అంతర్జాతీయ సంస్థలకు ప్రాతినిధ్యం వహించే స్థాయికి ఎదగాలన్నది సీఎం వైఎస్ జగన్ సంకల్పం. ఇందుకోసం విద్యా రంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చారు. ఇందులో భాగంగా విద్యార్థులు నైపుణ్య రంగంలో నిష్ణాతులుగా మారాలనీ.. విశాఖని స్కిల్ డెవలప్‌మెంట్‌కి కేంద్ర బిందువుగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో మంగళవారం భవిత కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్ శ్రీకారం చుడుతున్నారు. మధురవాడలోని వీ-కన్వెన్షన్ హాల్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొని.. ముందుగా అక్కడ ఏర్పాటు చేసిన 8 స్కిల్ డెవలప్‌మెంట్ స్టాల్స్‌ని పరిశీలిస్తారు. అనంతరం పరిశ్రమల భాగస్వాములతో స్కిల్ డెవలప్‌మెంట్ కోసం 3 ఒప్పందాల్ని సీఎం సమక్షంలో కుదుర్చుకోనున్నారు. ఈ సందర్భంగా స్కిల్‌లోగో, ఫ్లాగ్‌ని, స్కిల్ యాంథమ్‌ని, స్కిల్ యూనివర్స్ యాప్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు, న్యూ స్కిల్స్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించనున్నారు. నైపుణ్య శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులతోనూ సీఎం మాట్లాడనున్నారు.

సీఎం పర్యటన ఇలా..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమానంలో మంగళవారం 10.30 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో 10.45 గంటలకు మధురవాడ ఐటీ హిల్స్ నెం.3 వద్ద చేరుకుంటారు. స్థానిక ప్రజాప్రతినిధులతో ఇంటరాక్ట్ అవుతారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో 11 గంటలకు రాడిసన్ బ్లూ రిసార్ట్‌కు చేరుకుంటారు. 'విజన్..విశాఖ' పేరిట నిర్వహించే సదస్సులో వివిధ రంగాల వాణిజ్య, పారిశ్రామిక వేత్తలతో సమావేశమవుతారు. అక్కడ నుంచి 12.35 గంటలకు బయలుదేరి పీఎం పాలెం వైజాగ్ కన్వెన్షన్ హాల్‌కు చేరుకుంటారు. అక్కడ 'భవిత స్కిల్ డెవలప్‌మెంట్, సీడాప్ ఆధ్వర్యంలో ఉపాధి పొందిన యువతతో సమావేశమవుతారు. అనంతరం విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకొని 2.30 గంటలకు విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్టుకు బయలుదేరుతారు.

రూ.1500 కోట్ల అభివృద్ధి పనులకు...

విశాఖను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ పలు కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారు. నగర పర్యటనలో భాగంగా.. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ఆవిష్కరణలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారు. రూ.98 కోట్లతో వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి చేసిన ఐటీఐలు, పాలిటెక్నిక్ కళాశాలలను సీఎం వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. సుమారు రూ.100 కోట్లతో ముడసర్లోవలో నిర్మించనున్న జీవీఎంసీ నూతన భవనానికి శంకుస్థాపన చేస్తారు. రూ.10 కోట్లతో టర్టెల్ బీచ్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టనున్నారు. వెంకోజీపాలెం నుంచి మారియట్ హోటల్ వరకు ఆల్టర్నేటివ్ డబుల్ రోడ్ నిర్మాణం, మధురవాడకు కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి ఏర్పాటు చేయనున్న వాటర్ సప్లయ్ ప్రాజెక్టు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం తదితర ప్రాజెక్టులకు సీఎం వైఎస్ జగన్ శంకుస్థాపన చేయనున్నారు.

మిరియాల సిరులు

- అధిక దిగుబడితో పాదులు కళకళ
- సేకరణలో బిజీగా గిరిజనులు
- కిలోకు రూ.500 గిట్టుబాటు ధర
- ప్రారంభమైన వ్యాపారలావాదేవీలు
- ఎకరానికి రూ.40వేల ఆదాయం



మిరియాలను ఆరబెట్టి మార్కెటింగ్‌కు సిద్ధం చేస్తున్న గిరిజనుడు



పాడేరు మండలం గుర్రగరువులో పాదుల నుంచి మిరియాలు సేకరిస్తున్న గిరిజనులు

సాక్షి,పాడేరు: జిల్లాలో కాఫీతోటల్లో అంతరపంటగా గిరిజన రైతులు సాగుచేస్తున్న మిరియాల పాదులకు కాపు అధికంగా ఉంది. ఈఏడాది కూడా మిరియాల పంట గిరిజన రైతులకు సిరులు కురిపించనుంది. పాదులకు మిరియాలు విరగ్గాయడంతో కళకళాడుతున్నాయి. మిరియాల పంట సేకరణ పనుల్లో గిరిజన రైతులు బిజీగా ఉన్నారు. జిల్లాలో 1.60 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ఫలసాయం ఇచ్చే కాఫీతోటలు ఉండగా, వీటిలో సుమారు 70 వేల ఎకరాల్లో గిరిజనులు అంతర పంటగా మిరియాలను సాగుచేస్తున్నారు. ఎకరం కాఫీ పంటలో నీడనిచ్చే సిల్వర్‌టక్ వృక్షాలకు 100 వరకు మిరియాల పాదులు ఉన్నాయి. ఎకరానికి 300 కిలోల వరకు పచ్చిమిరియాలు దిగుబడి వస్తాయి. వాటిని వేడినీటిలో ముంచి తేమ పూర్తిగా పోయేంతవరకు ఆరబెట్టి ఎండు మిరియాలను తయారు చేస్తారు. ఎకరానికి 100 నుంచి 120 కిలోల వరకు ఎండు మిరియాలు తయారవుతాయి. ఈ ఏడాది మిరియాల కాపు ఆశాజనకంగా ఉంది. ఈఏడాది ప్రభుత్వం మిరియాల సేకరణకు అల్యూమినియం నిచ్చెనలను అందుబాటులోకి తెచ్చింది. వాటి ద్వారా మిరియాల సేకరణ గిరిజనులకు సురక్షితంగా మారింది.

మంచి డిమాండ్

జిల్లాలో సాగుచేసే మిరియాలకు పూర్వం నుంచి జాతీయ స్థాయిలో మంచి డిమాండ్ ఉండడంతో పాటు నాణ్యతలోను నంబర్-1గా నిలుస్తున్నాయి. రైతులు సేంద్రియ పద్ధతిలోనే పంటను సాగు చేస్తున్నారు. ప్రతి ఏడాది 100 కోట్లకు పైగానే మిరియాల వ్యాపారం జరుగుతుంది. ఈ ఏడాది కిలో మిరియాలకు రూ.500 చొప్పున ఐటీడీఏ గిట్టుబాటు ధర ప్రకటించింది. ఐటీడీఏకు పోటీగా అదే ధరతో కొనుగోలు చేయడానికి వ్యాపారులు గిరిజన రైతులకు అడ్వాన్స్‌లు చెల్లిస్తుండడంతో ఈఏడాది మంచి ఆదాయం రానుంది. అన్ని ఖర్చులు పోను ఎకరానికి రూ.40 వేల వరకు ఆదాయం వస్తుందని రైతులు తెలిపారు.

100 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేస్తాం



మిరియాల పంటకు గిట్టుబాటు ధర కల్పించి దళారుల అక్రమాలకు చెక్ పెట్టే లక్ష్యంతో పాడేరు ఐటీడీఏ చర్యలు తీసుకుంది. ఈ ఏడాది తొలిసారిగా కాఫీ విభాగం ఆధ్వర్యంలో మిరియాల గింజల కొనుగోలుకు కిలో ధరను రూ.500గా నిర్ణయించాం.100 మెట్రిక్ టన్నుల వరకు మిరియాలను కొంటాం. అయితే రూ.500 కంటే ఎక్కువ ధరతో కొనుగోలుకు వ్యాపారులు ముందుకు వస్తే అధిక ధరకు విక్రయించి రైతులు మంచి లాభాలు పొందాలి

– వి.అభిషేక్, ఐటీడీఏ పీవో,పాడేరు

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం

- పార్టీ జిల్లా అధ్యక్షుడు చెట్టి పాల్గుణ



అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

సాక్షి,పాడేరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలోని అరకు ఎంపీతో పాటు పాడేరు, అరకు,రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధించడమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉత్తరాంధ్ర రీజినల్ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, డిప్యూటీ రీజినల్ కోఆర్డినేటర్ గుడివాడ అమర్‌నాథ్‌ల సమక్షంలో అరకు, వైఎస్సార్‌సీపీ పాడేరు నియోజకవర్గ స్థాయి సమావేశాలు విజయవంతంగా జరగడం రానున్న ఎన్నికల్లో విజయానికి శుభ సంకేతాలన్నారు. జిల్లాలోని వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీలు సమర్థంగా పనిచేయాలని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గిరిజనులకు జరిగిన మేలును ఇంటింటా ప్రచారం చేయాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పాల్గుణ తెలిపారు.

పర్యాటకానికి పెద్ద పీట






బోడకొండమ్మ తల్లి ఆలయం వద్ద, చెరువులవేనం వద్ద నిర్మించిన వ్యూపాయింట్లను ప్రారంభిస్తున్న ఎంపీ మాధవి, ఐటీడీఏ పీవో అభిషేక్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ పాడేరు సమన్వయకర్త విశ్వేశ్వరరాజు

చింతపల్లిరూరల్: పర్యాటకానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి తెలిపారు. మండలంలో చెరువులవేనం, బోడకొండమ్మతల్లి ఆలయం వద్ద ఎంపీ నిధులతో నిర్మించిన వ్యూపాయింట్లను పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ పాడేరు సమన్వయకర్త విశ్వేశ్వరరాజుతో కలిసి ఆమె సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరికి గ్రామస్తులు థింసా నృత్యంలో స్వాగతం పలికారు. గ్రామస్తులతో కలిసి ఎంపీ, ఎమ్మెల్యేలు కొంతసేపు నృత్యం చేశారు. అనంతరం ఎంపీ మాధవి మాట్లాడుతూ చెరువులవేనం వ్యూపాయింట్ నిర్మాణానికి రూ.26.50లక్షలు, బోడకొండమ్మ తల్లి ఆలయం వద్ద వ్యూపాయింట్‌కి రూ.40లక్షల ఎంపీ నిధులు మంజూరు చేసినట్టు చెప్పారు. ఈ నిధులతో వ్యూపాయింట్ల నిర్మాణంతో పాటు మరుగుదొడ్లు, పార్కింగ్ స్థలం, సీసీ రోడ్డును నిర్మించినట్టు చెప్పారు. మన్యం ప్రాంతం అందాలకు పెట్టింది పేరని, ప్రతి సంవత్సరం ప్రకృతి అందాలను తిలకించేందుకు లక్షల సంఖ్యలో పర్యాటకులు వస్తారని చెప్పారు. రానున్న రోజుల్లో మరింతగా పర్యాటకులను ఆకర్షించే విధంగా ప్రభుత్వం పర్యాటకాభివృద్ధికి కార్యాచరణ రూపొందించిందని తెలిపారు. అన్ని వయసుల వారిని ఆకట్టుకునేలా పర్యాటక ప్రాంతాలను తీర్చిదిద్దుతున్నట్టు చెప్పారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పర్యాటకంగా లంబసింగికి ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. రానున్న రోజుల్లో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఇక్కడ వ్యూపాయింట్ల నిర్మాణానికి కృషి చేసిన ఎంపీ మాధవికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి వి.ఎస్.ప్రభాకర్, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, గిరిజన సంక్షేమశాఖ ఈఈ డి.వి.ఆర్.ఎం.రాజు, డీఈ చాణిక్య, జేఈ యాదకిశోర్, సర్పంచ్ కొర్ర శాంతికుమారి, గ్రీవెన్స్‌సెల్ జిల్లా అధ్యక్షుడు గొడ్డేటి మహేష్, ట్రైకార్ డైరెక్టర్ సుర్ల లోవరాజు, ఎంపీటీసీలు రావుల నాగమణి, మోహన్‌రావు, ముఖ్య నాయకులు కొర్ర రఘునాథ్, జల్లి సుధాక ర్, బూసరి కృష్ణారావు, బాబురావు పాల్గొన్నారు.

సీలేరు పీహెచ్‌సీ వైద్యాధికారులకు షోకాజ్ నోటీసులు



ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో జమాల్ బాషా

సీలేరు: స్థానిక పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరి వైద్యాధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు డీఎంహెచ్‌వో జమాల్ బాషా తెలిపారు. సోమవారం దారకొండ పర్యటనకు వచ్చిన పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మిలను సీలేరుకు చెందిన కొందరు ప్రజాప్రతినిధులు, స్థానికులు కలిసి పీహెచ్‌సీ వైద్యాధికారులపై ఫిర్యాదు చేశారు. సక్రమంగా విధులు నిర్వహించడం లేదని, ఆస్పత్రికి రావడం లేదని, ఫోన్ ద్వారా వైద్యం చేస్తున్నారని, సిబ్బందిపైనే భారంమోపుతున్నారని తెలిపారు. వెంటనే స్పందించిన పీవో... ఆ వైద్యులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని పక్కనే ఉన్న డీఎంహెచ్‌వోను ఆదేశించారు. దీంతో డీఎంహెచ్‌వో జమాల్ బాషా సీలేరు పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డు, ఓపీ, ఫార్మాసిస్టు ల్యాబ్ రికార్డులను పరిశీలించి, అనంతరం షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

సెక్టోరియల్ అధికారులదే పూర్తి బాధ్యత

- కలెక్టర్ విజయ సునీత



మాట్లాడుతున్న కలెక్టర్ విజయ సునీత, వేదికపై పీవోలు, సబ్ కలెక్టర్, ఏఎస్పీ

రంపచోడవరం: త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకు సెక్టోరియల్ అధికారులదే పూర్తి బాధ్యతని కలెక్టర్ ఎం.విజయ సునీత తెలిపారు. ఎన్నికలకు సంబంధించి రంపచోడవరం, చింతూరు పీవోలు సూరజ్‌గనోరే, చైతన్య, సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, ఏఎస్పీ జగదీష్ అడహళ్లిలతో కలిసి 11 మండలాల తహసీల్దార్‌లు, పోలీసు అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. స్థానిక ఐటీడీఏ సమావేశం హాలులో జరిగిన ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గంలో 399 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణ కోసం 59 మంది సెక్టోరియల్ అధికారులను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. పోలింగ్ విధులపై సెక్టోరియల్ అధికారులందరికీ శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల పరిస్థితిపై ఫొటోలు తీసి సమర్పించాలని ఆదేశించారు. సెక్టార్ అధికారులు, పోలీసు అధికారులు కలిసి రూట్ మ్యాప్‌లు తయారు చేసి అందజేయాలని తెలిపారు. ఓటు హక్కు ఉన్న ప్రతి పౌరుడు నిర్భయంగా ఓటువేసే విధంగా ఓటర్లకు అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. సెక్టార్ అధికారులకు మెజిస్ట్రేట్ పవర్‌ను ఎన్నికల కమిషన్ కల్పించినట్టు చెప్పారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఏర్పడిన తరువాత ఇవే మొట్టమొదటి ఎన్నికలని, ప్రశాంతంగా జరిగే విధంగా సెక్టోరియల్ అధికారులందరూ కృషి చేయాలని సూచించారు. ఎలక్షన్ కమిషన్ రూపొందించిన హ్యాండ్ బుక్‌ను పూర్తిస్థాయిలో చదివి పక్కాగా ఎన్నికల విధులు నిర్వహించాలన్నారు. ఈవీఎంలను స్ట్రాంగ్ రూములో భద్రపరిచే వరకు సెక్టార్ అధికారులదే పూర్తి బాధ్యతని కలెక్టర్ తెలిపారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు స్ట్రాంగ్ రూము లు వేర్వేరుగా ఉంటాయని తెలిపారు. ఈవీఎంలు నాలుగు కేటగిరీలుగా ఉంటాయని, ప్రతిపోలింగ్ బూత్‌లో సీసీ కెమెరాలు, మైక్రో అబ్జర్వర్లు ఉంటారని చెప్పారు. స్ట్రాంగ్ రూములు ఏర్పాటుపై రాజకీయ పార్టీలతో చర్చించనున్నట్టు తెలిపారు. ఎన్నికల సామగ్రిని పంపిణీ చేసేందుకు 30 కౌంటర్లు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. రంపచోడవరం సబ్‌కలెక్టర్ ఎస్.ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ఎవరికీ సెలవులు ఇవ్వరాదని సంబంధిత శాఖల అధికారులకు తెలియజేసినట్టు చెప్పారు. ఏఎస్పీ జగదీష్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలపై పోలీసు అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేయనున్నట్టు చెప్పారు. అనంతరం రంపచోడవరంలోని స్ట్రాంగ్‌రూమ్‌ను కలెక్టర్ పరిశీలించారు.



జడేరులో పోలింగ్‌కేంద్రాన్ని పరిశీలించి సూచనలు ఇస్తున్న కలెక్టర్ విజయ సునీత

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

గంగవరం : ఎన్నికలకు అధికార యంత్రాంగం సిద్ధం కావాలని, పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ విజయ సునీత ఆదేశించారు. సోమవారం రంపచోడవరం సబ్‌కలెక్టర్ ప్రశాంత్ కుమార్‌తో కలసి గంగవరం మండలంలో కలెక్టర్ పర్యటించారు. జడేరు ఎంపీపీ పాఠశాలలో గల 35వ పోలింగ్ కేంద్రాన్ని, గ్రామ సచివాలయ భవనంలో గల 34వ పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు. ఎంపీపీ స్కూల్‌లో రైలింగ్‌ను సక్రమంగా ఏర్పాటు చేయాలన్నారు. గ్రామసచివాలయం పోలింగ్ కేంద్రంలో నీరు, మరుగుదొడ్ల సమస్యలేకుండా చూడాలని ఆదేశించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై రెవెన్యూ, పోలీసు సిబ్బంది దృష్టి సారించాలని, ఏవిధమైన ఘర్షణలకు తావులేకుంటా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సచివాలయం వద్ద ఏఎన్ఎం, అంగన్‌వాడీ,ఆశాకార్యకర్తలతో కొద్దిసేపు మాట్లాడారు. మండల వ్యవసాయాధికారి కె.విశ్వ నాథ్, ఈవోపీఆర్డీ నరసింగరావు, ఆర్ఐ జిలానీబాషా, వీఆర్వో వెంకన్నదొర, హెచ్ఎం నూకరత్నం, హెచ్‌సీ రాంబాబు పాల్గొన్నారు.

7న జాబ్‌మేళా

కంచరపాలెం(విశాఖ): స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీయర్ సర్వీస్ సెంటర్‌లో ఈనెల 7వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు విశాఖ జిల్లా సబ్ రీజినల్ ఎంప్లాయ్‌మెంట్ అధికారి నిట్టాల శ్యామ్ సుందర్ తెలిపారు. హీరో మోటర్స్, ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్ సంస్థల్లో 140 ఉద్యోగాలకు భర్తీకి ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ట్రైనీ, జూనియర్ రిలేషన్‌షిప్ ఆఫీసర్. ప్రొడక్షన్ అసెంబ్లీ, ఉద్యోగాలకుటెన్త్, ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ, ఎంబీఏ, ఎంసీఏ పూర్తిచేసిన వారు అర్హులని పేర్కొన్నారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, తిరుపతి ప్రాంతాల్లో జాబ్ లోకేషన్ ఉంటుందన్నారు. అయా ఉద్యోగాన్నిబట్టి జీతం నెలకు రూ.10,000 -18,000 వరకు ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు.

వారు ప్రేమికులే..

- ఇద్దరూ మైనర్లేనని గుర్తించిన పోలీసులు
- మృతులు తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వారు





చైతన్య, జ్యోతి మృతదేహాలు

అనంతగిరి: మండలంలోని కటికి రహదారి కరకవలస గ్రామ సమీపంలోని ఆదివారం సాయంత్రం చెట్టుకు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడిన యువతీయువకులు ప్రేమికుల జంట అని, ఇద్దరూ మైనర్లని పోలీసులు గుర్తించారు. వారిద్దరూ తూర్పుగోదావరి జిల్లా హుకుంపేట గ్రామానికి చెందినవారు. మృతుల వద్ద దొరికిన వివరాలు, వారి స్వస్థలంలో నమోదైన మిస్సింగ్ కేసుల ఆధారంగా వారి ఆచూకీని సేకరించారు. మృతులను చైతన్య (17), జ్యోతి (14)లుగా గుర్తించారు. యువతి 9వ తరగతి చదువుతోంది. వీరిద్దరూ గత మంగళవారం ఇంటి నుంచి బయటకు వచ్చేశారు. వారం రోజులపాటు వివిధ ప్రాంతాల్లో తిరిగి, ఆదివారం అనంతగిరి మండలం కటికి జలపాతాన్ని సందర్శించి, సాయంత్రం ఓ చెట్టు వద్ద ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారని పోలీసులు తెలిపారు. ఇద్దరి మృతదేహాలకు సోమవారం అరకు ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మహిళా దినోత్సవాన్ని జరుపుకుందాం

- మావోయిస్టు పార్టీ జీకే, ఏఎస్ఆర్ కమిటీ

చింతూరు: ఈనెల 8న అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినాన్ని జరుపుకుందామని మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం, అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ ప్రతినిధి ఆజాద్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆజాద్ పేరుతో విలేకర్లకు పంపిన ప్రకటనలో మహిళలపై జరుగుతున్న అమానవీయ దాడులకు వ్యతిరేకంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. స్త్రీ, పురుష సమానత్వాన్ని సాధించుకుందామని, శ్రామిక విముక్తి లేనిదే స్త్రీ విముక్తి లేదని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

11న మేజిస్టీరియల్ విచారణ

మహారాణిపేట : విశాఖ సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తూ ఈ ఏడాది ఫిబ్రవరి 6న కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ చనిపోయిన అల్లూరి జిల్లా పెదబయలు మండలం, రూడకోట పంచాయతీ, బడంబీరు గ్రామానికి చెందిన కోడ పోతన్న మరణాన్ని లాకప్ డెత్‌గా పరిగణించి మేజిస్టీరియల్ విచారణకు కలెక్టర్ మల్లికార్జున ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 11న విశాఖ కలెక్టరేట్‌లోని ఆర్‌డీవో కార్యాలయంలో విచారణ నిర్వహించనున్నట్లు ఆర్‌డీవో హుస్సేన్ సాహెబ్ తెలిపారు. కోడ పోతన్న సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న సమయంలో అనారోగ్యానికి గురయ్యారని, ఫిబ్రవరి 6న చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించగా, అదే రోజు మృతి చెందాడని వివరించారు. పోతన్న మరణానికి సంబంధించిన వివరాలు తెలిసిన వారు విచారణకు హాజరై లిఖిత పూర్వకంగా తెలియజేయాలని ఆర్‌డీవో కోరారు.

స్థాయీ సంఘ సమావేశం రేపు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం బుధవారం నిర్వహించనున్నారు. నగర మేయర్, స్థాయీ సంఘం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి అధ్యక్షతన ఆ రోజు ఉదయం 11 గంటలకు జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశ మందిరంలో నిర్వహించనున్న సమావేశంలో 68 అంశాలు సభ్యుల ఆమోదానికి చర్చకు రానున్నాయి. జోన్-2 పరిధి 13వ వార్డు ముడసర్లోవ నర్సరీ పార్కులో పిల్లల ఆట స్థలంలో మౌలిక సదుపాయాలు, సివిల్ వర్క్స్ చేసేందుకు, హనుమంతువాక వద్ద రిటైనింగ్ వాల్ నిర్మించేందుకు, జోన్-2 పరిధి 8వ వార్డు తారకరామనగర్ శాటిలైట్ టౌన్, రుషికొండ లే అవుట్ ఓపెన్ స్పేస్‌లో పార్క్ అభివృద్ధి, 67వ వార్డు జోగవానిపాలెం నుంచి శంకర్‌నగర్ వరకు వీఆర్‌సీసీ కాలువ నిర్మాణం, కూర్మన్నపాలెం వుడా ఫేజ్-2 ఖాళీ స్థలంలో పార్క్ అభివృద్ధికి సంబంధించి అంశాలు చర్చకు రానున్నాయి.

తల్లీ బిడ్డ క్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరగాలి
- ఐటీడీఏ పీవో అభిషేక్, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి వెల్లడి

సీలేరు: తల్లీ బిడ్డ క్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఐటీడీఏ పీవో అభిషేక్, ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. దారకొండ పంచాయతీలో వారు సోమవారం పర్యటించారు. కార్యక్రమంలో భాగంగా దారాలమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. దారకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో బర్త్ వెయిటింగ్ హాల్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీలోని శివారు గ్రామాల్లోని గర్భిణులు సైతం ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. గిరిజనుల వైద్యానికి ప్రభుత్వం పెద్ద పీట వేసిందని ,వైద్య చరిత్రలో విప్లవ మార్పులు తీసుకువస్తూ ఐటీడీఏ పరిధిలో 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా అందులో 14 చోట్ల బర్త్ వెయిటింగ్ హాళ్లను నిర్మించనట్టు చెప్పారు. మెరుగైన ఫలితాలు రావడంతో ప్రభుత్వం మరో 13 కేంద్రాలకు గాను ఒక్కో కేంద్రం నిర్మాణం కోసం రూ.35లక్షల చొప్పున నిధులు మంజూరు చేసిందన్నారు. బర్త్ వెయిటింగ్ హాల్‌కు గర్భిణులను ప్రసవానికి వారం రోజుల ముందు తీసుకువాలని కోరారు. గతం కంటే ప్రతీ పిహెచ్‌సీకి ఇద్దరు చొప్పున వైద్యులు ఉన్నారని , ఫోన్ చేస్తే అన్ని ప్రాంతాలకు అంబులెన్స్ వచ్చే పరిస్థితి ఉందన్నారు. ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గిరిజనుల వైద్యానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యత ఇచ్చారని ఇందులో భాగంగా రూ.500 కోట్లతో పాడేరు మెడికల్ కళాశాల నిర్మాణం, బర్త్ వెయిటింగ్ హాళ్లు, విలేజ్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ సేవలు, మాతాశిశు మరణాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం విశేషమన్నారు. గిరిజనులు మూఢనమ్మకాలు వీడి ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డీఎంహెచ్‌వో జమాల్‌బాషా మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లోనూ నిరంతరం వైద్యులు అందుబాటులో ఉన్నారని, మాతా శిశు మరణాలు తగ్గించేందుకు జిల్లాలో 132 మంది వైద్యులను నియమించామని, అలాగే విలేజ్ క్లినిక్ ద్వారా గ్రామాల్లో వైద్యం అందే విధంగా బిఎస్సీ నర్సింగ్ చేసిన 297 మంది మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్‌లను నియమించినట్టు చెప్పారు. జిల్లాలో దాదాపు 4 వేల మంది ఆశ కార్యకర్తల ద్వారా మరింత వైద్యం గిరిజనులకు అందుతుందన్నారు. సీలేరు పిహెచ్‌సీలో గర్భిణులకు స్కానింగ్ మెషిన్ ను త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. ఎంపీపీ కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు శివరత్నం, సర్పంచ్ రాజు, దుర్గో , ఎంపీటీసీ సభ్యుడు రామన్న, జయలక్ష్మి పద్మ, సాంబమూర్తి, ఆలయ ఈఓ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



బర్త్ వెయిటింగ్ హాల్‌ను ప్రారంభిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి

ఐటీడీఏ పీవో కావూరి చైతన్య

చింతూరు: చిన్న వయసులోనే ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయడం వలన ఎన్నో ఇబ్బందులు ఎదురవుతాయని, బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య అన్నారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం డివిజనల్ స్థాయి చైల్డ్ మ్యారేజెస్ ప్రొహిబిషన్ ఆఫీసర్స్ కెపాసిటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న పీవో చైతన్య మాట్లాడుతూ ఆడ పిల్లలను చదివించేందుకు ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలుచేస్తోందన్నారు. ఏజెన్సీలో నిరక్షరాస్యత కారణంగా ఆడపిల్లలకు చిన్న వయసులోనే పెళ్లిళ్లు చేస్తున్నారని వీటిని అరికట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. గిరిజన ప్రాంతాల్లో చట్టాలపై అవగాహన కల్పించడం ద్వారా వారిలో మార్పుకు ప్రయత్నించాలని సూచించారు. ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి మాట్లాడుతూ ఆడపిల్లను చదవనిద్దాం, ఆడపిల్లను రక్షిద్దాం అనే నినాదంతో ముందుకు సాగాలని, ఆడ పిల్లల విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. డివిజన్, మండల స్థాయిలో బాల్య వివాహాల నిరోధక కమిటీలు ఉండాలని సూచించారు. ఏపీవో సుజాత, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, ఏఎస్‌డీఎస్ సంస్థ డైరెక్టర్ గాంధీబాబు, సీడీపీవోలు విజయగౌరి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచాలి

మారేడుమిల్లి: పర్యాటక ప్రదేశాలు, అటవీ ప్రాంతాల్లోకి ఎవరైనా ప్లాస్టిక్ వస్తువులు, వ్యర్థాలు గాని మద్యం బాటిళ్లు గాని తీసుకొస్తే చర్యలు తీసుకుంటామని రేంజర్ ఆజాద్ చెప్పారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో సీబీఈటీ సభ్యులు సోమవారం మారేడుమిల్లి నుంచి అమృతధార జలపాతం వరకు పర్యాటక ప్రదేశాల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. రహదారికి ఇరువైపులా ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలు, వాటర్, మద్యం బాటిళ్లు, చెత్తాచెదారాలను తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా రేంజర్ ఆజాద్ మాట్లాడుతూ పర్యాటక ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పర్యాటక, అటవీ ప్రాంతాల్లో ఎవరూ ప్లాస్టిక్‌ను తీసుకురావద్దని కోరారు.



అమృతధార జలపాతం పరిసరాలను శుభ్రం చేస్తున్న సీబీఈటీ సభ్యులు

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.

వైభవంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వెండిగరుడ వాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్టంపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

వలంటీర్ల ఔదార్యం



రాజమండ్రిలో చికిత్స పొందుతున్న సత్యవతికి పింఛన్ ఇస్తున్న వలంటీర్ ఆనంద్‌కుమార్



రాజమండ్రిలో చికిత్స పొందుతున్న రామారావుకు పింఛన్ ఇస్తున్న వలంటీర్ దుర్గాప్రసాద్

రాజవొమ్మంగి: మండలంలోని చెరకుంపాలెం సచివాలయంలోని వలంటీర్ తన ఔదార్యాన్ని చూపారు. తాను ఉండే గ్రామానికి 100 కిలోమీటర్ల దూరంలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలికి పింఛన్ అందజేసి గ్రామస్తుల మన్ననలు పొందాడు. చెరకుంపాలెం గ్రామానికి చెందిన అనుపోజు సత్యవతి అనారోగ్యం కారణంగా కొద్ది రోజులుగా రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెకు ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్‌ను వలంటీర్ కోటం ఆనంద్‌కుమార్ తన గ్రామం నుంచి రాజమహేంద్రవరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సత్యవతికి సొమ్మును అందజేశాడు. దీంతో ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ఆమెకు ఈ పరిస్థితుల్లో నగదు అవసరం చాలా ఉంటుందని భావించానని, ఈ మేరకు లబ్ధిదారునికి పింఛన్ అందజేసినట్టు చెప్పారు. ప్రభుత్వ సేవలను నిస్వార్థంగా చేయడం తన విధుల్లో భాగమన్నారు. ఈ మేరకు గ్రామ వలంటీర్ కోటం ఆనంద్‌కుమార్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

వీఆర్ పురం: కడుపునొప్పితో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడికి వలంటీర్ తన సొంత ప్రయాణ ఖర్చులతో 360 కిలోమీటర్లు ప్రయాణించి ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్ సొమ్మును అందచేశాడు. రేఖపల్లి గ్రామం పెద్దన్న వీధికి చెందిన వడ్డానపు రామారావు గతవారం కడుపునొప్పితో బాధపడుతూ రాజమండ్రిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా అతడు ప్రతీనెల వృద్ధాప్య పింఛన్ పొందుతున్నాడు. ప్రభుత్వం అతనికి మంజూరు చేసిన పింఛన్‌ను సక్రమంగా అందించేందుకు గ్రామ వలంటీర్ కొల్లుబోయిన దుర్గాప్రసాద్ విషయం తెలుసుకొని సోమవారం బస్సుపై రానుపోను 360 కిలోమీటర్లు ప్రయాణించి రాజమండ్రిలోని ఆస్పత్రికి చేరుకొని లబ్ధిదారునికి పింఛన్ అందించాడు , తన కోసం కష్టపడి పింఛన్ అందించిన దుర్గాప్రసాద్‌కు రామారావు ధన్యవాదాలు తెలిపాడు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్ర గాయాలు



తీవ్ర గాయాలైన మహిళ రాజేశ్వరి కిల్లో

పెదబయలు: మండలంలోని అరడకోట పంచాయతీ చుట్టుమెట్ట మలుపు వద్ద ఎదురుగా వస్తున్న వ్యాన్‌ను తప్పించే క్రమంలో రోడ్డుపై బైక్ స్కిడ్ కావడంతో మహిళలకు తీవ్రగాయాలయ్యాయి. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లాకు చెందిన జోగా కిల్లో, తల్లి రాజేశ్వరి కిల్లో అల్లూరి జిల్లా చింతపల్లి మండలం దూసురుపాలెంలో జరిగిన వివాహానికి వెళ్లి తిరుగుప్రయాణంలో చుట్టుమెట్ట మలుపు వద్ద ఎదురుగా వస్తున్న వ్యాన్‌ను తప్పించే క్రమంలో బైక్ అదుపు తప్పి స్కిడ్ అవడంతో రాజేశ్వరి తల, ముఖం, ఇతర శరీర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కు ఫోన్ చేయడంతో హుటాహుటిన పెదబయలు పీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై పెదబయలు ఎస్ఐ మనోజ్‌కుమార్ కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు



ప్రమాదంలో కాలు విరిగిన సింహాద్రి

పెదబయలు: మండలంలోని సీతగుంట గ్రామ సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో రోగులపేట గ్రామానికి చెందిన బొండా సింహాద్రికి తీవ్ర గాయాలయ్యాయి. రోగులపేట గ్రామానికి చెందిన సింహాద్రి పెదబయలు వారపు సంత నుంచి గ్రామానికి నడిచి వెళ్తుండగా సీతగుంట గ్రామ సమీపంలో ఎదురుగా వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొనడంతో అతని కుడి కాలు విరిగింది. వాహనంపై ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక పీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక వైద్యం అందించారు. వృద్ధుడు సింహాద్రిని పాడేరు జిల్లా ఆస్పత్రికి 108 వాహనంలో మెరుగైన వైద్యం కోసం తరలించారు.

సారా కేసుల్లో ఇద్దరి అరెస్టు

రాజవొమ్మంగి: మండలంలోని వాతంగి పంచాయతీ, ఓకుర్తి గ్రామ శివారులో సారా బట్టీలపై చేపట్టిన దాడుల్లో కుడుముల యేసుబాబు అనే వ్యక్తిని అరెస్టు చేశామని, 5 లీటర్ల స్వాధీనం చేసుకొని, 100 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు జడ్డంగి ఎస్ఐ రఘునాథరావు చెప్పారు.



పోలీసులు ధ్వంసం చేసిన సామగ్రి

కొయ్యూరు: మూలపేట పంచాయతీ మర్రిపాలెంలో సారా విక్రయిస్తున్న కె.కన్నయ్యమ్మ అనే మహిళను అరెస్టు చేసినట్టు ఎస్ఐ రామకృష్ణ చెప్పారు. ఆమె నుంచి అయిదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

విద్య, సామాజిక, ఆర్థిక ప్రగతే నిజమైన అభివృద్ధి



మాట్లాడుతున్న అజేయ కల్లాం

- రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజేయ కల్లాం
- ఏయూలో పాలనలో కొత్త పంథా-మన కోసం-మన ప్రభుత్వం అంశంపై సదస్సు

ఏయూక్యాంపస్ : ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య ప్రగతే నిజమైన అభివృద్ధికి నిదర్శనాలుగా నిలుస్తాయని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజేయ కల్లాం అన్నారు. అవర్ స్టేట్-అవర్ లీడర్ ఇండియన్ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో ఏయూ టీఎల్ఎన్ సభామందిరంలో 'పాలనలో కొత్త పంథా-మన కోసం మన వద్దకు సుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్ రూపాంతరం' అంశంపై సోమవారం నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన గత నాలుగున్నరేళ్లలో ఏపీలో విద్య, వైద్యం, మౌలిక వసతుల రంగంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. ఆచార్య టి.షారోన్‌రాజు మాట్లాడుతూ అంబేడ్కర్, పూలే ఆశయాలు, ఆలోచనలకు అనుగుణంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. సామాజిక సాధికారత రూపశిల్పిగా, అందరికీ విద్యను అందించే సంకల్పంతో ఆంగ్ల మాధ్యమం, సీబీఎస్ఈ బోధన, ఐబీ ప్రవేశపెట్టడంతో పాటు ఎడెక్స్‌లో రెండు వేలకు పైగా కోర్సులు, గ్లోబల్ ఎడ్యుకేషన్‌ను పేద విద్యార్థులకు చేరువ చేసిన ఘనత సీఎం జగన్‌కే సాధ్యమన్నారు. నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య వి.బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ నాడు-నేడు పథకంలో పాఠశాలలను అభివృద్ధి చేసిన విధానం నిరుపమానమన్నారు. కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చేశారన్నారు. వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి ఏయూను అభివృద్ధి పథంలో నిలిపి దేశంలోనే గుర్తింపు తీసుకొచ్చారన్నారు. ఎమ్మెల్సీ పి.రవీంద్రబాబు మట్లాడుతూ తన సొంత గ్రామంలో నాడు-నేడు పథకంలో భాగంగా జరిగిన అభివృద్ధిని ఉదహరిస్తూ ముఖ్యమంత్రి చేస్తున్న విప్లవాత్మక మార్పులు, ప్రగతిని వివరించారు. కోవిడ్ మహమ్మారి కుదిపేసినా రాష్ట్రంలో ప్రజల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యతను ఇచ్చారన్నారు. ప్రశాంత్‌కిశోర్ పరిణతి లేని వ్యక్తిత్వంతో మాట్లాడటం సరికాదన్నారు. జగన్ మోహన్‌రెడ్డికి మీరంతా పరిరక్షణగా, వెన్నంటి నిలవాలని కోరారు. ఆచార్య టి.తిమ్మారెడ్డి మాట్లాడుతూ సమాజంతో యువతను అనుసంధానం చేశారన్నారు. విద్యా రంగంలో వచ్చిన మార్పులను వివరించారు. కార్యక్రమంలో జి.శాంత మూర్తి, సురేష్ బేత తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుపతి స్పెషల్ రీ షెడ్యూల్...

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): విశాఖపట్నంలో సోమవారం రాత్రి 7.10గంటలకు బయల్దేరవలసిన విశాఖపట్నం-తిరుపతి (08583) స్పెషల్ సుమారు 4గంటలు ఆలస్యంగా రాత్రి 11.10గంటలకు విశాఖపట్నంలో బయల్దేరింది. పెయిరింగ్ రైలు రాక ఆలస్యం కారణంగా ఈ రైలు విశాఖపట్నంలో ఆలస్యంగా బయల్దేరినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

సమస్యలకు సత్వర పరిష్కారం

- కలెక్టర్ విజయ సునీత

రంపచోడవరం:గిరిజనుల సమస్యలపై సానుకూలంగా స్పందించి, సత్వరమే పరిష్కారం చూపాలని కలెక్టర్ విజయ సునీత అధికారులను ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశం హాలులో సోమవారం నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్‌లతో కలసి పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనులు, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు తమ సమస్యలు పరిష్కారం కోరుతూ అర్జీలు అందజేశారు. స్పందనలో 48 అర్జీలను స్వీకరించినట్టు కలెక్టర్ తెలిపారు. వీటిలో కొన్నింటిని వెంటనే పరిష్కరించామని, మరికొన్ని సమస్యలకు సంబంధించిన అర్జీలను సంబంధిత అధికారులకు పంపామని చెప్పారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయ సునీత, పీవో సూరజ్‌గనోరే, సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

- అడ్డతీగల మండలంలోని పులిగోగులపాడు గ్రామానికి జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్ మంజూరు చేయాలని కోసూరి సత్యనారాయణ దరఖాస్తు సమర్పించారు.
- దేవీపట్నం మండలంలోని పోలవరం ప్రాజెక్టు ముంపునకు సంబంధించిన బాధితులకు 18 సంవత్సరాల ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ మంజూరు చేయాలని పట్టెం గంగాభవాని తదితరులు అర్జీలు అందజేశారు.
- రంపచోడవరం మండలం భూపతిపాలెం ప్రాజెక్టు ముంపు బాధితులకు టూరిజం శాఖ ద్వారా పర్యాటకులను ప్రాజెక్టులో తిప్పేందుకు అనుమతి మంజూరు చేయాలని, సొసైటీ సభ్యులకు చేపలు పట్టుకునే విధంగా వలలు, లైఫ్ జాకెట్లు మంజూరు చేయాలని పల్లాల లచ్చిరెడ్డి, పల్లాల సోమిరెడ్డి, ఇళ్ల జోగిరెడ్డి అర్జీలు అందజేశారు.
- వై.రామవరం మండలంఎగువ ప్రాంతంలోని గుర్తేడు, ధారగడ్డ, ఎర్లకొండ గ్రామాల్లోని ఆరు చెక్ డ్యాములు నిర్మిస్తే 150 ఎకరాలకు సాగు నీరందుతుందని గిరిజన రైతులు కోరారు. స్పందనలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో విద్యార్థిని మృతి

డుంబ్రిగుడ (అరకులోయ టౌన్): అరకులోయ మండలంలో సిర్గం పంచాయతీలోని వరతోకవలస గ్రామానికి చెందిన జన్ని మేరి(13) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. మృతురాలు తండ్రి జన్ని స్వామి, అందించిన వివరాలు ప్రకారం జన్ని మేరి డుంబ్రిగుడ మండలం జాముగుడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతుంది. గత నెల24న పాఠశాల హెచ్‌ఎం మోద సుజాత ఫోన్ చేసి జన్ని మేరి అనారోగ్యంగా ఉన్నట్టు సమాచారం అందించారని, చికిత్స నిమితం పాఠశాల నుంచి మేరీని తీసుకొచ్చి అరకు సంతబయలులో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందించి ఇంటికి తీసుకువచ్చినట్లు చిన్నారి తండ్రి తెలిపారు. అయితే ఆదివారం ఉదయం తల్లిదండ్రులు చర్చికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేసరికి ఆమె మృతి చెంది ఉన్నట్టు తల్లి దండ్రులు తెలిపారు. మేరి మృతి చెందినప్పటికి పాఠశాల హెచ్‌ఎం, వసతి గృహం నిర్వాహకులు కూడా కనీసం స్పందించలేదని మృతురాలు తండ్రి జన్ని స్వామి ఆవేదన వ్యక్తం చేశారు, దీనిపై హెచ్‌ఎం సుజాతకు వివరణ కోరాగా గత నెల 24న మేరి తండ్రి వసతి గృహానికి వచ్చి విద్యార్థిని ఇంటికి తీసుకెళ్లారని, అప్పటి నుంచి సమాచారం లేదన్నారు, సోమవారం తాను విశాఖ నుంచి పాఠశాలకు వచ్చిన్నట్టు చెప్పారు.



మాట్లాడుతున్న మృతి చెందిన విద్యార్థిని తల్లిదండ్రులు

యువతకు విస్తృతంగా ఉపాధి అవకాశాలు

మధురవాడ/పీఎంపాలెం : రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు మరింత మెరుగు పరిచేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఏపీ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలెప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఎస్.సురేష్‌కుమార్ చెప్పారు. సోమవారం వి. కన్వెన్షన్ సెంటర్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మధురవాడ పర్యటన, యువతతో ఇంటరాక్ట్ కార్యక్రమాలను వివరించారు. రాష్ట్రంలో యువ టెక్నికల్ ఎడ్యుకేషనల్, ఒకేషనల్ ఎడ్యుకేషన్ రంగంలో యువతకు నైపుణ్యం ఉందన్నారు. పరిశ్రమల్లోని ఉద్యోగావకాశాలకు అనుగుణంగా నైపుణ్యాలు కల్పించేందుకు శిక్షణ ఇవ్వాలని భావిస్తున్నామన్నారు. ఈ మేరకు అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. స్కిల్ ఎకో సిస్టం పేరుతో రాష్ట్ర స్థాయిలో స్కిల్ కాలేజీలు ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో 192 చోట్ల స్కిల్ హబ్స్ ఏర్పాటు చేశామన్నారు. వీటి ద్వారా 15లక్షల మందికిపైగా శిక్షణ ఇచ్చామన్నారు. 3.70లక్షలు మంది ప్రైవేటు సెక్టార్‌లో ఉపాధి కల్పించామన్నారు. షేపింగ్ ఫ్యూచర్ క్రియేటింగ్ ఆపర్చ్యునిటీస్ పేరుతో నిర్వహించే కార్యక్రమాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ప్రారంభిస్తారన్నారు. ఉపాధికి సంబంధించి ఆన్‌లైన్ యాప్‌ను కూడా సీఎం ఆవిష్కరిస్తారన్నారు. ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ అండ్ సీఈవో ఎం. వినోద్‌కుమార్, జేసీ మయూర్ అశోక్ పాల్గొన్నారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న సురేష్‌కుమార్, అధికారులు